# చిన్నమామయ్య

ఉదయం ఏడుగంటలవేళ. ట్రాక్టరు రిపేరు వర్కేదో దగ్గరుండి చేయిస్తున్నాడు రాఘవరావు. కొబ్బరి చెట్ల నీడన చెరో కుర్చీలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటూ పేపరు తిరగేస్తున్నారు అత్తమామలు.

స్విచాఫ్ చేసి పాలల్లో తేరిన వెన్నముద్దని గుండిగలోకి తియ్యమని పనమ్మాయి విజయకి పురమాయించి వంటింట్లో స్టౌమీద పాలు మరిగాయేమో మాడ్డానికెళ్ళింది వనజ.

పాలు పొంగి తెర్లుతున్నాయి. వనజ స్టౌ కట్టేసి చారెడు బ్రూ పొడి ఓ గిన్నెలో వేసి మూడుగ్లాసుల కాఫీని తయారు చేసింది. రెండు గ్లాసులు అత్తమామల కిచ్చేసి రాఘవరావుకి ఒకటిచ్చింది.

తెల్లని వెండిగ్లాసులోని పొగలు సెగలు కక్కుతున్న చిక్కని పొగాకురంగు కాఫీని చూసి హుషారుగా అందుకున్నాడు రాఘవరావు.

రెండు నిముషాలు అక్కడే నిలబడి వనజ పరుగులాంటి నడకతో వెనక్కొచ్చింది. పిల్లలిద్దర్నీ లేపి స్కూలుకి తయారు చెయ్యాలని లోపలికెళ్లింది. పిల్లలింకా ముణగదీసుకుని పడుకుని వున్నారు. వాళ్ళని లేవదీసి బాత్‌రూముల్లోకి నెట్టి వంటింట్లోకెళ్ళి టిఫిన్ పనిలో పడింది.

అంతలో పాలసైకిళ్ళవాళ్ళొస్తే దగ్గరుండి పాలన్నీ కొలిపించి బిందెల్లో పోయించి ఎవరికెన్ని పాలు పోసిందీ బుక్కులో నోట్ చేసుకుంది.

రోజూ పొద్దున్నే ఆ ఇల్లు వనజ పాలిటికి పద్మవ్యూహంలా వుంటుంది. తిరిగిన చోటే తిరుగుతూ పనులన్నీ చక్కబెట్టాలి.

వనజను కలిమింటి కోడల్ని చెయ్యాలని వనజ తండ్రి వున్నదంతా ఊడ్చి పెళ్ళి చేశాడు.

ఇంటికి వచ్చే పోయే బంధువులు, పనివాళ్ళెందరున్నా తరగని గంపెడంత చాకిరీ ఒకే ఒక కోడలుగా వనజ నెత్తినపడ్డాయి.

ఏడాదికోసారి చేసే తిరుపతి ప్రయాణం తప్ప ఆ ఇంట ఆటవిడుపనేదే ఎరగదు వనజ. వ్యవసాయప్పనులులేని రోజుల్లో రాఘవరావు మద్రాసో, హైదరాబాదో చెక్కేస్తూ వుంటాడు తరచుగా. వనజ అడిగితే – "ఈ పల్లెటూళ్ళో ఏం తోస్తుందోయ్ ఏదో కాలక్షేపానికి అలాగ ఓ ట్రిప్" అంటూంటాడు.

"మరి కాలక్షేపం నాకక్కర్లేదా?" అంటే, "నీకేం, హాయిగా చేతినిండా పనుంది" అన్నాడోసారి.

పిల్లాడి స్కూల్ డ్రెస్ కోసం వెతుకుతూంటే బీరువాలో నగలపెట్టె కన్పించింది. పెళ్ళిలో పుట్టింటివాళ్ళూ, అత్తింటివాళ్ళూ పెట్టిన నగలు కాక ఏడాదికోసారి పంటలు రాగానే కొత్తగా చేయించే నగల్తో వనజ నగల పెట్టె నిండిపోతోంది.

ఒకప్పుడా నగల్ని చూసి ఎంతో ఆనందం కలిగేది. ఇప్పుడెందుకో ఆ నగల పెట్టెను చూసినప్పుడల్లా ఏదో నిర్వేదం కమ్ముకుంటోంది.

ఆ నగలన్నీ అలంకరించుకుని ఎక్కడికెళ్ళాలి? వాటిని ఎవరు చూడాలి? పెళ్ళిళ్ళకీ పేరంటాలకీ అత్తమామలే వెళ్తుంటారు. తనకు తోడబుట్టినవాళ్లెవరూ లేరు చూసి సంతోషించేందుకు. నాలుగేళ్ళ క్రితం తల్లి, ఏడాది క్రితం తండ్రి కాలం చేశారు.

"అమ్మగారూ! మీ కోసం ఎవరో వచ్చేరు" వీధి వైపు వాకిట్లో కొబ్బరిపీచు కొడుతూన్న వాళ్లల్లోంచి ఓ మనిషి పెద్దగా కేకపెట్టింది.

"పొద్దున్నే ఎవరు దిగడ్డారో, ఇవతల కాలు కదిపే టైమ్ లేక చస్తూంటే" సణుక్కుంటూ బయటికెళ్లిన వనజ వీధి గుమ్మంలో నిలబడి వున్న ఆగంతకుణ్ణి చూసి ఆగిపోయింది. మాసిన గడ్డం, తైల సంస్కారం లేని జుట్టు, బక్కపలచని మనిషి, రక్తదానం పేరు చెప్పి అడుక్కోవడానికొచ్చేడనుకుంది.

"నేను... నా పేరు... రామ్మూర్తండి. కాకినాడ నుంచొచ్చేను" అన్నాడతను.

"..."

"ఆనందరావుగారు మిమ్మల్ని ఉన్నపళంగా పిల్చుకు రమ్మన్నాడు" నలిగి మాసిపోయిన కాయితం ఒకటి జేబులోంచి తీసిచ్చేడు.

వంకరటింకర అక్షరాలు – చూడగానే గుర్తుపట్టింది వనజ తన చిన్నమామయ్య రైటింగ్‌ని. పదిరోజుల క్రితం తారీఖు వేసుంది.

"ఎప్పుడవసరం అవుద్దో అని ముందే రాసుంచేడు".

పీచుపనివాళ్లంతా పని ఆపేసి చూస్తున్నారు.

"ఎందుకు?" అంది వనజ చిరాగ్గా.

"ఆయనకి వచ్చే ప్రేణం పొయే ప్రేణం అన్నట్టుంది రాత్రేళనించి, మిమ్మల్ని చూడాలంటున్నాడు"

వనజ గుండె గతుక్కుమంది.

"ఏం ఏమైంది?" అంది కంగారుగా.

"తిండి జీర్ణవయ్యాసోట కేన్సరంటండి. రెండునెల్ల బట్టి ఏం తిన్నా ఇవట్టల్లేదు" అని చెప్పాడు.

వనజ వీధి గుమ్మంలో ఏవరితోనో అంతసేపు మాట్లాడ్డం చూసి మామగారు బయటికొచ్చాడు. వనజ లోపలికి తప్పుకుంది.

పావుగంట తర్వాత రాఘవరావు లోపలికొచ్చి -

"వనజా! కాకినాడ వెళ్ళిరా, నీ వెంట తోడుగా వుండేందుకు విజయొస్తుంది" అన్నాడు.

'వీళ్ళింత అర్జంటుగా తనని పంపిస్తున్నారంటే, చిన్నమామయ్య ప్రాణాల్తో లేడా' వనజ మనసు కీడు శంకించింది. వనజ తయారై వచ్చేసరికి రాఘవరావు కారు తీసి గేటు ముందుంచాడు.

"రేవు నాలుగడుగులేగా నడిచేస్తే పోలే".

"నువ్వు నడిచేస్తావులే, నాన్న నన్ను తిట్టిపోస్తాడు".

వనజ కాలవ ఒడ్డున కారు దిగేసరికి రామ్మూర్తి ముందే నడిచి వచ్చినట్టున్నాడు పంటును ఆపి తన కోసం ఎదురుచూస్తున్నాడు.

"విజయా! పొద్దు పోకుండా తీసుకొచ్చెయ్ అమ్మగార్ని" అన్నాడు రాఘవరావు.

వనజ మనసు భారంగా వుంది. గతం కళ్ళముందు మెదిలింది. తను పుట్టే సరికి చిన్నమామయ్యకి పదేళ్ళట. తన తల్లి తోబుట్టువులిద్దర్లోనూ చిన్నవాడు ఆనందరావు. అమ్మమ్మగారి ఆర్థిక పరిస్థితి తలకిందులు కావడంతో పెద్దమామయ్య చెప్పాపెట్టకుండా ఇల్లొదిలి వెళ్ళిపోయాడట.

తను కడుపులో వున్నప్పుడు పురిటికి పుట్టింటికెళ్ళిన తన తల్లి తమ్ముణ్ణి చదివించాలని తమ ఊరికి తీసుకొచ్చిందట. స్కూలుకెళ్ళి చదువుకుంటూనే ఇంట్లో అందరికీ పెద్దపనీ చిన్నపనీ సాయం చేస్తూ ఉండేవాడు. బాగా గుర్తు, తనకి అయిదారేళ్ళు వచ్చేవరకూ ఎప్పుడూ ఎత్తుకుని తిప్పుతూండేవాడు. తనంటే విపరీతమైన మమకారం కనబరిచేవాడు.

ఒకసారి తను ఊరి మంచినీళ్ళ చెరువులోని తామరపువ్వు కావాలని అడిగితే ఈత రాకపోయినా చెరువులోకి దిగిపోయాడు.

సమయానికి చెరువు కాపలాదారు దగ్గర్లో వుండి వుండకపోతే ఊబిలో మునిగి పోయేవాడే. ఇంటికొచ్చేక అందరూ పెట్టిన చీవాట్లని చిన్నమామయ్య నోరు మెదపకుండా తిన్నాడేగాని తన పేరుమాత్రం బయటపెట్టలేదు.

సెలవులకి కాకినాడ వెళ్ళినప్పుడల్లా అమ్మమ్మ 'మా ఆనందం పెళ్ళాన్ని తీసుకుని వచ్చేడు' అంటుంటే తను బాగా ఉడుక్కునేది. అతను మాత్రం ఎంతోసంతోషంగా కనపడేవాడు.

ఆనందానికి చదువు ఒంటబట్టలేదు. స్కూల్ ఫైనల్లో ఫెయిలవుతూంటే తాతయ్య వచ్చి కాకినాడ తీసుకెళ్ళిపోయాడు. మోటారు మెకానిక్ కంపెనీలో పనికి కుదిరి ఇక అక్కడే స్థిరపడిపోయాడు.

తనకి పదహారేళ్ల వయసప్పుడనుకుంటా అమ్మమ్మ, చిన్నమామయ్య కలిసి తమ ఇంటికొచ్చారు. తనని చిన్నమామయ్యకిచ్చి చెయ్యమని అమ్మమ్మ అమ్మని వంటింట్లో అడగడం తను చెవులారా వింది.

మర్నాడు ఉదయం పెరట్లో అరుగుమీద కూచుని నాయనమ్మ 'బంగారంటి పిల్లని ఆ కోతి మొకవోడికి చెయ్యమనడానికి మీ నోళ్ళెలాగొచ్చినయ్యే. దేనికైనా ఒక తాకతు వుండక్కర్లేదూ! తమ్ముడైతే సరిపోయిందా, ఎన్నాళ్లో పెట్టుకుని మేపింది చాల్లేదా. ఇంక పిల్లని గూడా ఇచ్చి ఏటెల్లకాలం నెత్తినెట్టుకుని మోస్తారా" అంటూ రంకెలేసింది.

పొద్దుటివేళ కాఫీలైనా తాక్కుండా అమ్మమ్మ, చిన్నమామయ్య బస్సెక్కి వెళ్ళిపోయారు. మళ్ళీ ఎప్పుడూ తమ గుమ్మం ఎక్కలేదు.

ఏమనుకున్నాడో తన పెళ్ళికి వచ్చాడు చిన్న మావయ్య. అమ్మ తమ్ముణ్ణి పట్టుకుని ఏడ్చింది - 'ఆనందం! ఇలా ఎన్నాళ్ళుంటావురా? పెళ్ళి చేసుకుని ఓ ఇంటివాడివి కారా'. అంటూ.

తన అత్తగారి ఊరు కాకినాడకు దగ్గర్లోని లంకల గ్రామం కావడంతో 'దగ్గర్లోనే వుంటావు కదా, అప్పుడప్పుడు వెళ్ళి మేనకోడల్ని చూస్తూండరా ఆనందం' అని చెప్పింది అమ్మ. ఇక అంతే, నెలనెలా వచ్చి చూసి వెళ్తూండడం ప్రారంభించాడు.

ఒకట్రెండుసార్లు రాఘవరావు హాస్యమాడేడు - "ఏంటోయ్, మీ చిన్న మామయ్యకి నువ్వంటే ఇష్టం లాగుందే' అంటూ. అప్పట్నుంచీ తనకి అతను వచ్చేడంటే తెలీని చికాకనిపిస్తూ వుండేది. అయినా దాన్ని లోపలే దాచుకుని పైకి పలకరిస్తూ వుండేది.

చిన్నమామయ్యకి కేన్సరని ముందే తెలిసినా తనకి చెప్పకుండా దాచేడా? 'అయ్యో, పాపం పూర్ ఫెలో చిన్నప్పుడంతా నన్నెత్తుకుని మోసినందుకైనా నేను అతన్ని ఇంకొంచెం బాగా చూసి వుండాల్సింది' అనుకుంటూంటే వనజ కళ్ళు చెమర్చాయి.

యానాం రేవులో పంటు దిగి బస్సెక్కారు. జగన్నాధపురం చారిటీస్ దగ్గర బస్సు దిగి రామ్మూర్తి రిక్షా పిలుస్తుంటే వారించి ఆటో పిలిచింది వనజ. రామ్మూర్తి డ్రైవరు పక్కన ఒదిగి కూర్చున్నాడు.

చిన్నమామయ్యలాగే ఇతనికి ఆత్మన్యూనతా భావం మెండుగా వున్నట్టుంది. జీవన స్థితిగతులో, ఆర్థిక పరిస్థితులో, మరింకే సంఘటనలో మనుషుల్ని కృంగదీస్తూ వుంటాయి కాబోలు.

జీవితంలో అన్నీ అమరిన తన భర్తలాంటి వాళ్ళు అదృష్టవంతులు. అతని పూర్వీకుల ఆస్తిపాస్తులకు తోడు వరకట్నం కూడా తోడైంది. అతను కోరింది క్షణాల్లో తన ముందుకు రప్పించుకోగలడు.

రోజంతా ఎండలో వానలో రెక్కలు ముక్కలు చేసుకునే ఈ రామ్మూర్తిలాంటి వాళ్ళ జీవితాలు ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్నట్టుంటాయి.

ఆటో చొల్లంగి రేవు సమీపంలో బడుగువర్గాల కోసం ప్రభుత్వం కట్టించిన చిన్న చిన్న ఇళ్ళ మధ్యగా రొచ్చుగుంటల్నీ, మురిక్కాలవల్నీ దాటుకుంటూ పోయి పోయి కాలనీ చివర ఆగింది.

ఆటో వెనక పరుగెత్తుకొచ్చిన పిల్లలంతా ఆగిపోయి కళ్ళప్పగించి చూస్తూ నిల్చున్నారు.

వనజ ఆటో దిగి డబ్బులిచ్చి చుట్టూ పరికించింది.

ఆ పరిసరాల్ని ఆక్రమించుకున్న మురుగుకంపు ముక్కు పుటాల్ని బద్దలు చేస్తోంది.

చిన్నమామయ్య ఇక్కడా వుంటున్నాడు? తాతయ్య వుండగానే ఇల్లు అమ్మేశాడు. అయితే మాత్రం ఇలాంటి చోటుకా వచ్చి చేరడం?

"అమ్మగారూ! అక్కడనుకుంటాను" అంది విజయ – రోడ్డు దిగువ సన్నని సందులోకి చూస్తూ. వనజ అటు చూసింది. మురుగుకాలవ పక్కన పటిక నేలపైన గడ్డిపరకల పడకమీద...

వనజ శరీరం ఒక్కసారిగా వజవజ వణికింది.

పక్కనే నడుస్తూ రామ్మూర్తి అంటున్నాడు – "ఛెమించాలమ్మా, ఆనందం సీటీ రాసిచ్చి అయిదారు రోజుల్నుంచి మిమ్మల్ని పిలుసుకురమ్మని బతిమాల్తన్నాడు. నాకే

ఈలుపడక కదిలేనుగాను ఎదవని. రాత్రెప్పుడో నిద్దట్లోనే ప్రేణం పోయింది. ఇషయం ఇంటికాడ అయ్యగారికి చెప్పేనండి" భుజంమీది తువ్వాలుతో కళ్ళు ఒత్తుకుంటూ.

నాలుగు సన్నని రాటలు పాతి, పైన రెండు కొబ్బరాకులు కప్పేరు.

ఆనందం శవం పక్కన ఇరవై ఏళ్ళ బక్కపలచని అమ్మాయి ఏడ్చిఏడ్చి కంట్లో నీళ్ళు ఒంట్లో ఓపికా అయిపోయినట్టు కూర్చునివుంది. ఒళ్ళో ఏణ్ణర్థం పిల్ల ఆమె రొమ్ము చీకుతూ, మెడలోని పసుపు కొమ్ముతో ఆడుకుంటోంది.

'చిన్నమామయ్య ఈ పిల్లతో వుండేవాడు కాబోలు' అనుకుంటే వనజకేదో వెగటులాంటి భావం కలిగింది.

ఆనందం కళేబరాన్ని చూసింది.

చిన్నమామయ్య కంటూ మిగిలిన రక్తసంబంధీకురాలు తనే. అందుకే అంత్యకాలంలో తనను చూడాలని ఎంతగానో పరితపించివుంటాడు.

ఆనందంతో పని చేసే వర్కర్స్, చుట్టు పక్కల వాళ్ల అంతా కలిసి పది పదిహేను మంది అంతవరకూ ఎక్కడెక్కడో కూర్చున్నవాళ్ళంతా లేచొచ్చారు.

చకచకా కార్యక్రమాలన్నీ ముగించి క్షణాల మీద కట్టెను పాడెమీదికెక్కించి తీసుకెళ్ళిపోయారు. అక్కడ తుడిచి, నీళ్లుజల్లి, పిడకలదాలి వెలిగించి అత్తెసరు పెట్టారు.

ఎవరో ఒకామె సత్తుచెంబులో టీ తెచ్చి గ్లాసుల్లో పోసి అందరికీ ఇస్తోంది.

వనజకివ్వడానికి జంకుతున్నట్టుగా గ్లాసు దూరంగా పెట్టి వెళ్ళిపోయింది.

అక్కడ అందర్లోనూ తను వేరుగా వున్నానని స్ఫురించింది వనజకి. తన ఒంటిమీది ఖరీదైన చీరనూ, నగల్నీ ఓసారి చూసుకుంది.

విజయ వనజకి దగ్గరగా జరిగి "అమ్మ గారూ! ఈళ్ళందరూ ఈదులు తుడిసే రెల్లోళ్ళు" అంది గుసగుసగా.

ఎవ్వరైతేనేం, మానవత్వం వున్నవాళ్లు. ఇంతకాలం తల్లి తోడబుట్టినవాడు ఏ పరిస్థితుల్లో బతుకు ఈడుస్తున్నాడో పట్టించుకోని తనకన్నా, కష్టం తెలిసీ తన డబ్బును ఖర్చు చెయ్యాల్సొస్తుందేమోనని తనని ఒక్కదాన్నీ పంపించిన తన భర్తకన్నా వీళ్ళెంతో నయం.

వెనకా ముందూ ఎవరూ లేని లక్ష్మిని ఆనందం ఏ పరిస్థితుల్లో మనువాడేడో దాపరికం లేకుండా కథలాగా చెప్తోందొకావిడ తోటివాళ్ళకి.

రెల్లికులంలో పుట్టిన లక్ష్మి ఒడిలో బిడ్డకి తండ్రి చిన్నమామయ్య మాత్రం కాదన్న మాట!' అనుకుంది.

కడుపులోంచి దుఃఖం తన్నుకొస్తోంది కాబోలు లక్ష్మి ఉండుండి కదిలి కదిలి ఏడుస్తోంది. మనసు ఆర్ద్రంకాగా దగ్గరకి జరిగి లక్ష్మి వెన్ను నిమిరింది వనజ.

"ఏడవకు, ఊరుకో" అంది ఎలాగో గొంతు పెగుల్చుకుని.

'నీ బతుక్కేం భయంలేదు. నిన్ను నా వెంట తీసుకెళ్తాను' అనాలన్పించింది. కాని అత్తమామల్ని, రాఘవరావుని తల్చుకుని అంత పని చెయ్యలేకపోయింది. ఆ ఇంట్లో తనకంత స్వతంత్రం ఏది?

దాలిమీద అత్తెసరు ఉడుకుపట్టి కుతకుతలాడుతోంది. గరిటతో కలుపుతూ స్వగతంలాగా అంటోందొకావిడ -

"ఏదో ఆ బగవంతుడి దయవల్ల ఆ బాబు దొరికేడు లచ్చిమికి. ఆ బాబు ఉజ్జోగంకాడ దాసిన డబ్బులన్నీ తల్లికి పిల్లకీ వొత్తయ్యంట. ఆ కాడే లచ్చిమికి పనికూడా ఇత్తారంట. ఏదో దాని బతుకలాగ గడిసిపోతే సాలు".

ఒకే ఒక గది. బయట కాళ్ళు చాపుకొని పడుకోడానికి చాలనంత అరుగు. గదిలో కొద్దిపాటి వంట సామగ్రి, కిరోసిన్ స్టౌ వున్నాయి.

ఓ మూల గోడకి చిన్నమామయ్య ఎప్పుడో నవ్వుతూ తీయించుకున్న బస్ట్‌సైజ్ ఫోటో ఒకటి ఫ్రేములో వేళ్ళాడుతోంది. దానికింద పాత ట్రంకుపెట్టె. అవును... ఆ పెట్టె చిన్నమామయ్యదే. తనకి బాగా గుర్తు. మరో దండెం మీద మాసిన చీరలు, లంగాలు, పాపాయి గౌన్లు... టైము రెండు కావస్తోంది.

లక్ష్మి లేచి గోడకి చేరబడి కూర్చుని పిల్లకి పాలిస్తోంది.

వనజ లక్ష్మి భుజం మీద చెయ్యేసి - "ఇక వెళ్తానేం, మళ్ళీ ఇంకోసారి వస్తాన్లే" అంది. లక్ష్మి అవుననీ కాదనీ అనకుండా అభావంగా చూసింది. ఎవరో వెళ్ళి ఆటో పిల్చుకొచ్చేరు. మట్టి రోడ్డు వరకూ నడిచొచ్చి ఆటో ఎక్కేరు వనజ, విజయ.

ఆటో కదిలి స్పీడందుకోబోతూండగా పన్నెండేళ్ల కుర్రాడొకడు రొప్పుకుంటూ పరుగెడుతూ వచ్చి స్కూలు బాక్స్ సైజున్న ప్లాస్టిక్ పెట్టె ఒకటి వనజ చేతికిచ్చి "లక్ష్మక్క ఇమ్మంది" అనేసి వెనక్కి పరుగెత్తేడు.

వనజ క్యూరియస్‌గా బాక్స్ హుక్స్ తీసి తెరిచింది. బాక్స్ మూతకి లోపల అంటించి వనజ పదహారేళ్ళ వయసప్పటి ఫోటో - తలంటుకున్న జుట్టు విరబోసుకుని, చేతిలో గులాబిపువ్వుతో నవ్వుతూ వున్న ఫోటో అది.

ఫ్రెండెవరిదో కెమెరా తెచ్చి చిన్నమామయ్యే తీసేడా ఫోటోని. తర్వాత ఫోటో ఏదని అడిగితే రాలేదన్నాడు. ఆ విషయం తనప్పుడే మరిచిపోయింది.

ఇక బాక్స్ నిండా పదీ, అయిదూ నోట్లు, చిల్లర నాణేలు... ఒక్కక్షణం అర్థంకాక పోయినా వనజకి స్ఫురించింది. చిన్న మామయ్య వచ్చినప్పుడల్లా ఖర్చులకని తనిచ్చిన డబ్బులివి.. కడుపులో సుళ్ళు తిరుగుతున్న దుఃఖభాండం పగిలింది - వనజ ఒక్కసారిగా భోరుమంది.

*స్వాతి సపరివార పత్రిక, 27.11.98*